క్లుప్తంగా

కాళిదాసు పురుషోత్తానికి ఉగాది పురస్కారం



నెల్లూరు(బృందావనం): సాహితీవేత్త కాళిదాసు పురుషోత్తానికి విశ్వావసు – 2025 ఉగాది ప్రతిభ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం



నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 51వ డివిజన్ నేతలు, కార్యకర్తలతో సమావేశాన్ని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం నిర్వహించారు. రామ్‌జీనగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ పనిచేయాలని కోరారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు హాజరు



నెల్లూరు(అర్బన్): అమరావతిలోని సచివాలయంలో కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌ను సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. దీనికి కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ హాజరయ్యారు. స్వర్ణాంధ్ర – 2047 సాధనలో భాగంగా జిల్లాలో అన్ని శాఖలు చేపట్టనున్న అభివృద్ధి పనులపై నివేదికను కలెక్టర్ ప్రజెంట్ చేశారు.

మ్యారేజ్ మీడియేటర్స్ అసోసియేషన్ ఎన్నిక



నెల్లూరు సిటీ: న్యూ సమైఖ్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రంక్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్టాభిరామయ్య మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా గున్నం శ్రీనివాస్, జిల్లా మహిళాధ్యక్షురాలిగా రత్నమ్మ, గౌరవాధ్యక్షుడిగా హరినారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రమేష్,, కోశాధికారిగా నాగరాజునాయుడు, సంయుక్త కార్యదర్శిగా రాజ్యలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా రవిరెడ్డి, కంపా వాణి, కల్యాణి, మౌనిక, రఘురామయ్య, రమణయ్య, ప్రసన్నలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా నారాయణ, సాయి ప్రసాద్, సిద్దేశ్వర్ వెంకటాద్రి తదితరులు వ్యవహరించారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు టిఫిన్ బండి నుంచి నీళ్ల తీసుకెళ్తుండగా, అడ్డుకున్న యజమానిపై ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. వివరాలు.. చిన్నబజార్‌లోని దూదివారి వీధిలో నివసిస్తున్న సురేష్ స్థానికంగా టిఫిన్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో టిఫిన్ బండి వద్దకు మస్తాన్ ఈ నెల 22వ తేదీ రాత్రి వచ్చారు. క్యాన్‌లో నీటిని పట్టుకొని మద్యం తాగేందుకు తీసుకెళ్తుండగా, సురేష్ అడ్డుకున్నారు. దీంతో మస్తాన్ తన స్నేహితుడు శ్రీనివాసులుతో కలిసి సురేష్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

నెల్లూరు (క్రైమ్): నగరంలోని సరస్వతీనగర్‌లో ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడులను బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిపారు. పేకాటాడుతున్న శ్రీనివాసులు, సురేంద్ర, నాగరాజు, రమేష్, భార్గవ్‌తో పాటు పద్మ అనే మహిళను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.26,950 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కేసులకు బెదిరేదిలేదు

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): తనపై కూటమి ప్రభుత్వం కేసులను అక్రమంగా బనాయించినా ధైర్యంగా ఎదుర్కొంటానే తప్ప, భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముత్తుకూరు మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. రాజకీయంగా పోరాడలేక తమపై కేసులను పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసులు, అరెస్టులు, దాడులతో అరాచక పాలనను సాగిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన నేతలు, కార్యకర్తలను జగనన్న 2.0 పాలనలో గుర్తిస్తామని తెలిపారు. పార్టీ శ్రేణులను హింసించిన వారిని విడిచిపెట్టేది లేదని చెప్పారు. జిల్లాలో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులతో సోమిరెడ్డి అంటకాగుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన పాపాలను నమోదు చేస్తున్నామని, వడ్డీతో సహా తిరిగివ్వడం ఖాయమని తేల్చిచెప్పారు. గ్రామాల వారీగా బాధ్యతలు నిర్వర్తించగలమనేవారికి పార్టీ పదవులను అప్పగిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యొచ్చినా సత్వరమే స్పందించి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆదుకునేందుకు పార్టీ శ్రేణులు చర్యలు చేపట్టాలని సూచించారు.

రైళ్లలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మురళీధర్

నెల్లూరు (క్రైమ్): రైళ్లలో చోరీలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ ఆదేశించారు. తన కార్యాలయంలో రైల్వే అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైళ్లలో రాత్రి గస్తీని పెంచాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రైళ్లతో పాటు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేయాలని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించాలని ఆదేశించారు. నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే ఎస్సైలు హరిచందన, రమాదేవి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు

వేడుకగా త్యాగరాజ స్మరణోత్సవాలు



మహావిష్ణు అలంకారం



మాండలిన్ కచేరి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా స్వామివారు మహావిష్ణువు అలంకారంలో మంగళవారం దర్శనమిచ్చారు. చెన్నైకి చెందిన రాజు, నాగమణి, జయవిఘ్నేశ్వర్, సుబ్రహ్మణ్యంరాజు మాండలిన్ కచేరి రసరంజకంగా సాగింది. వాద్య సహకారాన్ని శేఖర్, శివకుమార్ అందించారు. హరికథా గానాలను వేల్పుల సరస్వతి, రాముడు నిర్వహించారు. అనంతరం కీబోర్డు, గాత్ర, మృదంగ లయ విన్యాసం, వయోలిన్, వీణకచేరీలను ఔత్సాహిక కళాకారులు వీనులవిందుగా జరిపారు. కాగా త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయని స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తెలిపారు.

వ్యాసరచన, కవితల పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, కవితల పోటీలను నెల్లూరు జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, నెరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ, శింగంశెట్టి మురళి, ప్రిన్సిపల్ సిస్టర్ ఆంటోనీ మేరీ, అరుణ, నజ్మా, భారతి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు అత్యంత ఖరీదైన అలోజెనిక్ బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా నిర్వహించామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ రంగరామన్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను ఆయన తెలియజేశారు. జిల్లాకు చెందిన 24 ఏళ్ల మహిళ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, చికిత్స అనంతరం కేన్సర్‌ను పూర్తిగా నయం చేయాలంటే అలోజెనిక్ బోన్‌మారో చికిత్స ఒక్కటే మార్గమనే విషయాన్ని తెలుసుకున్నారని చెప్పారు. వివిధ ఆస్పత్రులకు వెళ్లగా, చికిత్స, ఇతర ఖర్చులకు రూ.25 లక్షలవుతాయని అక్కడి వైద్యులు తెలిపారన్నారు. దీంతో తమ ఆస్పత్రికి రాగా, అన్ని పరీక్షలు చేశామని వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా సగం డబ్బులే వస్తాయని, ఈ తరహా అధునాతన చికిత్స తొలిసారి కావడంతో మిగిలిన మొత్తాన్ని ఆస్పత్రి యాజమాన్యం భరించిందని పేర్కొన్నారు. ఆపరేషన్ విజయవంతమైందని తెలిపారు. ఐసీయూ డాక్టర్ గౌతమ్, హాస్పిటల్ సెంటర్ హెడ్ ధీరజ్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ధర్నా



నెల్లూరు(బృందావనం): నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ కార్యాలయ ఎదుట మహా ధర్నాను సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్ మాట్లాడారు. తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో పలు సమస్యలను ప్రజలు తెలియజేశారని చెప్పారు. సమస్యలను నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారని ఆరోపించారు. పన్నులను భారీగా పెంచడంపై ధ్వజమెత్తారు. పన్నుల వసూళ్ల పేరుతో ప్రజలపై దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు.

అదనపు కమిషనర్ అడ్డగింత

మహాధర్నా సమయంలో కార్యాలయంలోకి ప్రవేశిస్తున్న అదనపు కమిషనర్ నందన్ కారును సీపీఎం కార్యకర్తలు అడ్డుకున్నారు. నేతలు జోక్యం చేసుకొని కార్యకర్తలకు సర్దిచెప్పారు. అనంతరం మేయర్ స్రవంతి, అదనపు కమిషనర్‌కు వినతిపత్రాలను అందజేశారు. నేతలు నాగేశ్వరరావు, మస్తాన్, పెంచలయ్య, నరసయ్య, అజీజ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సతీష్,, నరసింహ, మట్టిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేదగిరి నృసింహుడి సేవలో..



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారిని ఆర్పీఎఫ్ ఐజీ, సికింద్రాబాద్ అరోమాసింగ్ ఠాగూర్ కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈఓ గోపీ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకుడు రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాల్



నెల్లూరు(అర్బన్): కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నెల్లూరుకు చెందిన శాఖవరపు వేణుగోపాల్ ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. వేణుగోపాల్‌కు పీఎంపీ కేంద్ర అధ్యక్షుడు ముఖేష్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ కశ్యప్, కోశాధికారి సీఎస్ రావు శుభాకాంక్షలను తెలియజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 19వ డివిజన్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు.

ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): సోమశేఖరపురంలోని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో ఉద్యోగుల భవిష్యనిధి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నామని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ కమిషనర్ అమితాబ్ శుక్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిధి ఆప్కే నిఖత్ – 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత కోరారు. కుష్టు వ్యాధిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే తగు చికిత్సను అందించి కాపాడొచ్చని చెప్పారు. కొత్తగా కనుగొన్న కేసులపై అప్రమత్తంగా ఉంటూ, సమీపంగా ఉంటున్న వారితో పెప్ మందులను మింగించాలని కోరారు. అనంతరం జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్యాంపులను ప్రతి నెల 11న నిర్వహించి అవసరమైన వారికి ఎమ్సీఆర్ చెప్పులను అందించాలని సూచించారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంఓ ఏఓ సతీష్, మల్లమ్మ పాల్గొన్నారు.

బహిరంగంగా వ్యర్థాలేస్తే జరిమానా



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బృందావనం): బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. జీఎన్టీ రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టేషన్, సర్వోదయ కళాశాల మైదానం తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. చెత్త సేకరణ వాహనాలకే వ్యర్థాలను అందించాలని సూచించారు. రహదారులపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, డివైడర్ల చివర్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. సర్వోదయ కళాశాలలో నడక, వ్యాయామం చేస్తున్న వారికి అవసరమైన వసతులను కల్పించాలని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ప్రజలందరూ పాల్గొనేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా మంగళవారం నిర్వహించారు. భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా అల్లంపాటి రఘురామిరెడ్డి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

ఇఫ్తార్ విందు



29వ డివిజన్లో..

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 29వ డివిజన్లో గల గాంధీనగర్‌లో మస్జిద్ – ఏ– అన్సారీలో ఇఫ్తార్ విందును మంగళవారం ఏర్పాటు చేశారు. దీనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. మైనార్టీ నేత రఫీ తన సొంత నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపనను నిర్వహించారు. కార్పొరేటర్లు సత్తార్, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, నేతలు సలీమ్, రావు శ్రీనివాసరావు, రియాజ్, జాకీర్ హుస్సేన్,జుబేర్, ఖదీర్, ఆరిఫ్,ముజఫర్, మల్లి పాల్గొన్నారు.

నెల్లూరు (పొగతోట): నగరంలోని ఆచారివీధిలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి మున్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు కరిముల్లా, వేలూరి మహేష్, పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సిద్దిఖ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వర్‌రెడ్డి, జహీద్, యస్దానీ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఆచారివీధిలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎస్సార్‌ఎస్ కల్యాణ మండపంలో ఇఫ్తార్ విందును విద్యుత్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ హాజరయ్యారు. ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, సుధాకర్, శేషాద్రి బాలచంద్ర, పరంధామయ్య, రమేష్‌చౌదరి, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్, రఫీ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఎస్సార్‌ఎస్ కల్యాణ మండపంలో..

పీ – 4 సర్వేతో లబ్ధిదారుల గుర్తింపు



నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పీ – 4 సర్వే ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారులను గుర్తించనున్నామని పలువురు పేర్కొన్నారు. నగరంలోని 54 డివిజన్లలో పీ – 4 సర్వే వార్డు సభలను మంగళవారం నిర్వహించారు. ఉగాది పర్వదినాన కార్యక్రమాన్ని ఈ నెల 30న ప్రారంభించనున్నారని చెప్పారు. సర్వేలో భాగంగా వార్డు సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించనున్నారని, ఆర్థిక స్థితి, మౌలిక సదుపాయాలు తదితరాలను సేకరించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయనున్నారని వెల్లడించారు.

ఆదాయ పన్నును సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీధర్

నెల్లూరు (టౌన్): ఆదాయ పన్నులను సకాలంలో చెల్లించాలని ఆదాయపన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదాయ పన్ను చెల్లింపుపై నగరంలోని సరస్వతీనగర్‌లో గల ఐఎంఏ హాల్లో డాక్టర్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అడ్వాన్స్ ట్యాక్స్, పన్ను చెల్లింపు విధానాన్ని వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు, ఆదాయ పన్ను అధికారి సందీప్‌కృష్ణ, డాక్టర్ అశోక్, ఐఎంఏ ప్రెసిడెంట్ అమర్‌నాథ్, సెక్రటరీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



నెల్లూరు సిటీ: శక్తి యాప్‌పై కాకుపల్లిలోని సస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సును రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. శక్తి యాప్‌ను మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. డయల్ 100, 112, 1098, 1930 నంబర్లపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ స్వాతి, డాక్టర్ దినకర్‌రెడ్డి, ఏఎస్సై సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ శామ్యూల్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగయ్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నెల్లూరు రూరల్ మండలంలోని అక్కచెరువుపాడులో గల మైనార్టీ గురుకుల పాఠశాల (బాలురు)లో 6, 7, 8 తరగతుల్లో అడ్మిషన్ పొందవచ్చని, వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లాడ్జిలో వ్యక్తి మృతి

నెల్లూరు (క్రైమ్): లాడ్జిలో అద్దెకు దిగిన వ్యక్తి మృతి చెందిన ఘటన వహాబ్‌పేటలోని సీపీఆర్ రెసిడెన్సీలో మంగళవారం చోటుచేసుకుంది.. పోలీసుల సమాచారం మేరకు.. చెన్నైకి చెందిన రోహన్ (45).. లాడ్జిలో ఈ నెల 19న దిగారు. అప్పటి నుంచి పెయింట్ పనులు చేసుకొని తిరిగి లాడ్జికి వచ్చేవారు. అనారోగ్యంగా ఉండటంతో సమీపంలోని హాస్పిటల్‌కు సోమవారం వెళ్లి చికిత్స చేయించుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలోనూ గది నుంచి బయటకొచ్చి మళ్లీ లోపలికెళ్లారు. మరోవైపు ఉదయం ఎనిమిది గంటలకు రూమ్‌ను ఖాళీ చేయాల్సి ఉండటంతో, విషయాన్ని గుర్తుచేసేందుకు గానూ గది వద్దకు సిబ్బంది వెళ్లి తలుపుతట్టగా, తీయలేదు. పక్కనే ఉన్న కిటికీ నుంచి చూడగా, బెడ్డు పక్కనే నేలపై రోహన్ పడి ఉండటాన్ని చూసి తలుపులను బలవంతంగా తెరిచారు. అపస్మారక స్థితిలో ఉండటంతో 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు రోహన్‌ను పరిశీలించి, అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. సమాచారం అందుకున్న చిన్నబజార్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నిర్వాహకుడు పెంచలకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.